క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి

బూర్జ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని బూర్జ పీహెచ్‌సీ వైద్యులు జి.రాజశేఖర్, ఐ.పావని అన్నారు. సూపర్ వైజర్ లఖినాన సరోజిని ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఏపీపేట, మదనాపురం గ్రామాలలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. బీపీ, సుగర్ తనిఖీ చేశారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని కురిగాం, మెట్టూరు పీహెచ్‌సీల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 15 తేదీ నుంచి మండల వ్యాప్తంగా వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 30 తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లో వైద్యం అందివ్వనున్నారు. మండలంలో ఇంతవరకు 12 వేల కుటుంబాలకు సర్వే చేయడం జరిగింది.

హిందూ సంస్కృతి గొప్పది



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రకాశనంద స్వామి

సారవకోట: హిందూ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని ప్రకాశనంద స్వామి (సిరిపురం) అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యంలో 86వ సత్సంగం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాలు, విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి ఉంటాయన్నారు. మహాభారతం, రామాయణంలోని ముఖ్య ఘట్టాలను రామకృష్ణ శర్మ వివరించారు.బగాది రామారావు, కూన తవుడు తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణా మోడ్రన్ రైస్ మిల్లు ఆధ్వర్యంలో నారాయణ సేవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బుడితి పీఏసీఎస్ చైర్మన్ మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి

ఆమదాలవలస: పాత పెన్షన్ విధానం మాత్రమే కొనసాగించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బి.జనార్దనరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను విస్మరించి నష్టదాయకమైన విధానాలు అమలు చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, సభ్యులు పి.వైకుంఠరావు, దన్నాన శ్రీరామ్మూర్తి, బెండి గోవిందరావు, బెండి నారాయణరావు, కె.కోటేశ్వరరావు, కె.షన్ముఖరావు, పేడాడ భానూజీరావు, పి.వెంకటేశ్వరరావు, కె.వి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మూడు బోర్లు ఏర్పాటు



బోరు తవ్వేందుకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీలోని మూడు గ్రామాలలో ఆదివారం జల్ జీవన్ మిషన్ పథకం కింద మూడు బోర్లు ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా బోర్లు మంజూరైనప్పటికీ సంబంధిత అధికారులు బోర్లు లవ్వించ లేదు. గ్రామస్తులు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో ఆయన చొరవతో ఆదివారం మూడు గ్రామాలలో బోర్లు తవ్వించారు. సర్పంచ్ బొమ్మాళి అసిరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావు నాయుడు, మాజీ ఎంపీటీసీ మెండ సూర్యనారాయణ, మెండ సుందరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

121 కేజీల లడ్డూ వితరణ



స్వామివారి సన్నిధిలో లడ్డూ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం వెలమ వీధిలో ఏర్పాటు చేసిన గణేషునికి అదే గ్రామానికి చెందిని జలుమూరు సోమేశ్వరరావు, గోపి అన్నదమ్ములు స్వామివారికి ఆదివారం రాత్రి 121 కేజీల లడ్డూను ప్రసాదంగా వితరణ చేశారు. స్వామివారి నవరాత్రుల అనంతరం వేలంపాట నిర్వహించి భక్తులకు ప్రసాదంగా పంచిపెడతామన్నారు.

● చెట్టు తొలగింపు



బూర్జ మండలంలోని గుత్తావల్లి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం కూలిన మామిడి చెట్టును ఆదివారం తొలగించారు. ఈ రహదారిలో ప్రయాణికులు, వాహనదారులు యథావిధిగా ప్రయాణాలు సాగించారు. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. – బూర్జ

● కుంకుమార్చనలు

సారవకోట మండల కేంద్రంలోని కర్ణం–బ్రాహ్మణ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో కంకుమార్చనలు నిర్వహించారు. వినాయక నవరాత్రులు పురస్కరించుకుని రుత్వికులు సుబ్రహ్మణ్య శాస్త్రి మహిళలతో సామూహిక కుంకుమార్చనలు చేయించారు. – సారవకోట



● ప్రకృతి సాగుతో మేలు



ప్రకృతి విధానంలో సాగు చేస్తే వ్యవసాయంలో మంచి ఫలితాలు ఉంటాయని సరుబుజ్జిలి మండలంలోని రావివలస సర్పంచ్ వందాన కృష్ణ తెలిపారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు విధానంపై ఆదివారం రైతులకు అవగాహన కలిపించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసిన కషాయంతో పురుగులు, తెగుళ్లు నివారించవచ్చునని యూనిట్ ఇన్‌చార్జి మన్మథరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ బృందం సభ్యులు పాల్గొన్నారు. – సరుబుజ్జిలి

పరుగులు తీస్తున్న అభివృద్ధి



ముషిడిగట్టులో నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



కొబగాంలో నిర్మించిన రివట్‌మెంట్ వాల్, మెట్లు

- మారిన గ్రామ, పట్టణ రూపురేఖలు
- 16 సచివాలయాల్లో పూర్తయిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు

● మండలంలో సచివాలయాలు:	24
● గడప గడపకూ కార్యక్రమం పూర్తయినవి:	16
● ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున మంజూరైన నిధులు:	రూ. 3.20 కోట్లు
● ప్రతిపాదించిన పనులు:	115
● పూర్తయిన పనులు:	21
● ప్రొగ్రాస్‌లో ఉన్న పనులు:	72



తామరాపల్లి మెయిన్ వీధిలో నిర్మించిన సీసీ డ్రెయిన్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమంతోపాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. జోరుగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులతో పల్లెలు.. పట్టణాల రూపురేఖలు మారుతున్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సచివాలయ, వెల్‌నెస్ కేంద్రాలు, ఆర్‌బీకేలకు భవన నిర్మాణం జరుగుతున్నాయి. మరో వైపు 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమంలో భాగంగా మంజూరు చేస్తున్న నిధులతో గ్రామ, వార్డుల్లో నెలకున్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. గడప గడపకు కార్యక్రమం పూర్తయిన సచివాలయాలకు ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేస్తోంది. ఈ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులతో అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మండలంలో 24 సచివాలయాలు ఉండగా..వీటిలో 16 సచివాలయాలకు రూ. 20 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. అంతర్గత రోడ్లు, సీసీ డ్రైన్లు, సపోర్టింగ్ వాల్స్ పలు రకాల పనులు చేపట్టారు.

సమస్యలు పరిష్కారం



మా గ్రామానికి గడప గడపకూ నిధులు రూ. 20 లక్షలు వచ్చాయి. వీటితో పది అభివృద్ధి పనులు ప్రతిపాదించాం. ఐదు పూర్తి చేశాం. చాలా కాలం నుంచి మెయిన్ రోడ్డుకు ఆనుకొని సీసీ డ్రైన్లు శిథిలమై స్థానికులు అవస్థలు పడ్డారు. ఈ నిధులతో సీసీ డ్రైన్ నిర్మించాం. అలాగే చింతు వీధిలో సీసీ రోడ్డు నిర్మించాం. స్థానికులు ఎంతో ఆనందిస్తున్నారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అయినట్టే.

– ముచ్చ గనేష్.. తామారాపల్లి

రోడ్డు బాగుపడింది



గత ప్రభుత్వ హయాంలో నాయుడు వీధిలోని రోడ్డును నాయకులు పట్టించుకోలేదు. వర్షం పడితే నీరు రోడ్డుపై నిలిచి అధ్వాన్నంగా తయారయ్యేది. గోతులు మయంగా ఉండేది. గడప గడపకూలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడంతో రోడ్డు నిర్మించుకున్నాం. ఇప్పుడు రోడ్డు బాగుపడింది. వర్షం పడినా ఇబ్బంది లేదు.

– పి.పాండురంగమూర్తి, నాయుడు వీధి, నరసన్నపేట

ఏళ్లనాటి రోడ్డు సమస్య పరిష్కారం



వంశధార కార్యాలయాన్ని ఆనుకుని బాబానగర్ ఉంది. గతంలో కొందరు రియల్ ఎస్టేట్ వేస్తే స్థలాలు కొని ఇళ్లు కట్టుకున్నాం. అయితే రోడ్డు సక్రమంగా లేక పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం వస్తే నరకం చూసే వాళ్లం. గడపగడపకూ కార్యక్రమంలో వచ్చిన ఎమ్మెల్యే కృష్ణదాస్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆయన నరసన్నపేట ఉప సర్పంచ్ కృష్ణబాబుకు సూచించి పనులు చేయించారు. చిరకాలంగా ఉన్న రోడ్డు సమస్య తీరింది.

– కరిమి వెంకటరమణ, బాబానగర్, నరసన్నపేట

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణదాస్



శ్రీవారి ఆలయం వద్ద ఎమ్మెల్యే కృష్ణదాస్ కుటుంబం

పోలాకి: తిరుపతిలో శ్రీవారిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు కల్యాణోత్సవ మండపంలో శ్రీమలయప్పస్వామివారు సూర్యప్రభ వాహనంపై త్రివిక్రమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే సతీమణి, పార్టీ సీఈసీ మెంబర్ పద్మప్రియ, కుమారుడు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణచైతన్య ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



విక్టరీ సింబల్ చూపుతున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సన్మానం

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో ఐదోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ పిలుపునిచ్చారు. ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఇతర ప్రధాన నాయకులను సత్కరించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషి, సహకారంతో నరసన్నపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోలగుతున్నామన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలానే అభివృద్ధి కార్యక్రమాలు జరిపించుకోవాలంటే మళ్లీ కృష్ణదాస్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో నరసన్నపేట మండలం నుంచి అత్యధిక మెజార్టీ ఇద్దామని స్పష్టం చేశారు. మండల పరిషత్ నుంచి జరిగిన అభివృద్ధిని ఎంపీపీ వివరించారు. జెడ్పీ నుంచి వచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను రామారావు వివరించారు. ఇదే విధంగా రానున్న మూడేళ్లు పాలకవర్గానికి సహకారం అందించాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికార యంత్రాంగానికి కోరారు. పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు హైమావతి, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, యాళ్ల కృష్ణంనాయుడు, సురంగి నర్సింగరావు, శంకరరావు, యాబాజి రమేష్, బొబ్బాది ఈశ్వరరావు, పొట్నూరు సాయి ప్రసాద్, షేక్ బాబ్జీ, చింతల వెంకటరమణ, పంగ బావాజీ నాయుడు, పాగోటి రాజారావు, లుకలాపు రవి, సాసుపల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఆమదాలవలస: ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి జె.శ్రీనివాసరావు అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఆదివారం అవగాహన శిబిరం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో పారదర్శక పాలన కోసం రూపొందించిన సమాచార హక్కు చట్టం–2005పై ప్రజలు అవగాహన కల్పించుకుంటేనే చట్టం పటిష్టంగా అమలు అవుతుందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉంగటి వెంకటరమణ, అధ్యక్షుడు రామకృష్ణారావు, కార్యవర్గ సభ్యులు ఎల్.ధర్మారావు, బి.రమణమూర్తి, ఎస్.రాంబాబు, డి.వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు

కొత్తూరు: మోకానిక్‌లు యూనియన్‌లుగా ఏర్పడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని మోకానిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు అన్నారు. కొత్తూరులోని శ్రీవిజయదుర్గ మోకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్‌లు బైక్‌లు తీసుకువచ్చినప్పుడు తల్లిదండ్రులను పిలిపించిన తరువాత మరమ్మతులు చేయాలన్నారు. అపరచిత వ్యక్తులు బైక్‌లు అమ్మకానికి, ఇంజిన్లు, బోర్డు ప్లేట్లులు మార్చడానికి తీసుకువచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసోసియేషన్ ద్వారా చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందరరావు, ఎస్.వెంకటరమణ వివరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పి.భాస్కరరావు, ఎన్‌జీఓ కార్యదర్శి బి.సంజీవరావు, రాజాం, పొందూరు, శ్రీకాకుళం, రణస్థలం, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, మెళియాపుట్టి తదితర ప్రాంతాలకు చెందిన మెకానిక్‌లు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం



బస్టాండ్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

పాతపట్నం: పాతపట్నం పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న బస్టాండ్‌లో సుమారు రూ.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నట్లు సర్పంచ్ శిర్ల వేణుకుమారి తెలిపారు. బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి అనకాపల్లికి చెందిన శ్రీలక్ష్మీనర్సింహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.25 లక్షతో మహిళలు, పురుషులకు మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయని, స్నానాలకు వేడినీరు సదుపాయం కూడా ఉంటుందన్నారు. పనులు నాణ్యతాప్రమాణాలతో చేపడుతున్నామన్నారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 25వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రహరాజపాలెంలోని ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద వేలంపాట ఉంటుదన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 9 గంటలకు ఆధార్ జిరాక్సుతో పాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని సీఐ పేర్కొన్నారు.

125 మందికి కంటి పరీక్షలు

పొందూరు: జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు మండలంలోని మొదలవలసలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యడ్ల రత్నప్రియ, బెవర భారతి, డాక్టర్ మొదలవలస సుధీర్‌కుమార్ 125 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. 26 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సర్పంచ్ నీలవేణి, ఎంపీటీసీ సభ్యుడు సీతారామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు కొనసాగిద్దాం



జాషువా, భీమన్న చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట: సమాజాభ్యున్నతి కోసం పాటుపడుతూ, సామాజిక చైతన్యం కోసం రచనలు చేసిన గుర్రం జాషువా, బోయి భీమన్నల వంటి మహనీయులు అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాల కోసం పని చేద్దామని సామాజిక సమరసత వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ బార్ల వేణుగోపాలరావు అన్నారు. గుర్రం జాషువా, బోయి బీమన్నల జయంతిని ఆదివారం సమరసతా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బార్ల వేణు గోపాలరావు, వేదిక నరసన్నపేట అధ్యక్షుడు సదాశివుని కృష్ణ మాట్లాడుతూ బోయి బీమన్న, గుర్రం జాషువా రచనలు నేటితరం విద్యార్థులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత బమిడపాటి గౌరీశంకర్, జోష్యుల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



బూర్జ: డొంకలపర్తలో అన్నసమారాధన నిర్వహిస్తున్న గ్రామస్తులు



పొందూరు: మలకాం పట్టుశాలి వీధిలో ఏర్పాటుచేసిన అన్నదానం



ఎల్.ఎన్.పేట: చింతలబడవంజలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మలకాం, పిల్లలవలస, పొందూరు, బాణాం, కింతలి, దళ్లిపేట, లోలుగు, నందివాడ, బురిడికంచరాం తదితర గ్రామాల్లో ఆదివారం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

బూర్జ: మండలంలోని డొంకలపర్తలో వినాయక పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుంకుమార్చన, అన్నసమారాధన చేపట్టారు. గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని పూజారిపేట సుయ్యి వీధిలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.

నరసన్నపేట: స్థానిక నాయుడువీధి–కొత్తవీధి వద్ద నిర్వహిస్తున్న వినాయక నవరాత్రుల్లో భాగంగా వినాయక విగ్రహానికి శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి ఆదివారం పూజలు నిర్వహించారు. 34 ఏళ్లుగా మట్టి విగ్రహాలను పెట్టి వీధిలో నవరాత్రులు నిర్వహిస్తున్నామని విశ్రాంత ఆర్డీఓ పి.ఎర్రయ్య వివరించారు. అలాగే మారుతీనగర్ మొదటి వీధిలో వినాయ విగ్రహానికి పుష్పాలంకరణ నిర్వహించారు.

కుంకుమ పూజలు

ఎల్.ఎన్.పేట: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలబడవంజ గ్రామంలో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.